క్లుప్తంగా

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు


స్వామి వారికి అభిషేకం చేస్తున్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని సూర్యక్షేత్రం సమీపంలో ఉన్న కార్యసిద్ధి వీరహనుమాన్ ఆలయంలో శనివారం అభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు రామకోటి స్తూపాలను, రాముడి పాదుకలను దర్శించుకున్నారు. ఆలయంలో ప్రతిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు గుండా శ్రీనివాసులు, గుండా హరినాథ్, దేవరశెట్టి వెంకటేశ్వర్లు, గుండా చంద్రశేఖర్, ప్రభాకర్, అర్చకుడు శ్రీరాంపాండే, భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చివ్వెంల : విద్యుత్ లైన్ల మరమ్మతు కోసం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ అధికారి ఎ.మల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంతోపాటు వాల్యతండా, మంగళితండా, మున్యానాయక్‌తండా గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలు సహకరించాలని కోరారు.

నూతనకల్ : మాచనపల్లి గ్రామ పరిధిలోని వినియోగదారులకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రణయ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. వినియోగదారులు ట్రాన్స్‌కో సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

నూతనకల్ : నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో ఈ నెల 30న నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ కోరారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సీపీఐ ఆవిర్భవించి 100వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని నిర్వహించే బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశానికి సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా, సూరవరం సుధాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యానాల వెంకట్‌రెడ్డి, తొట్ల ఎల్లయ్య, రవి, పాపయ్య పాల్గొన్నారు.

నీటి విడుదల షెడ్యూల్ కోసం రైతుల ఎదురుచూపు


అర్వపల్లి శివారులో సాగులో ఉన్న పొలాలు

అర్వపల్లి : యాసంగి సీజన్‌కు సంబంధించి గోదావరి జలాల విడుదలపై షెడ్యూల్‌ను ప్రకటించకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సీజన్ మొదలై నెల దాటిందని, అయినా ఇంత వరకు నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించకుంటే పంటలు ఎలా సాగు చేసుకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. నార్లు పోసుకునే సమయం దాటి పోతుందని చెబుతున్నారు. ఇప్పటికైనా వెంటనే షెడ్యూల్‌ను ప్రకటించాలని అధికారులను కోరుతున్నారు.

కోతుల దాడిలో గాయాలు

అర్వపల్లి : అర్వపల్లి గ్రామ పంచాయతీ ఆవాసం సీతారాంపురం గ్రామంలో శనివారం కోతులు పలువురిని గాయపర్చాయి. గ్రామానికి చెందిన ఒర్సు యాదమ్మతో పాటు అంకిరెడ్డి లింగయ్య కుమారుడు హేమంత్‌లపై కోతులు దాడి చేశాయి. ఇప్పటికైనా కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

బీటీగా మారుస్తాం

నడిగూడెం : మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నలమాద పద్మావతి అన్నారు. మండలంలోని సిరిపురం నుంచి రత్నవరం వరకు రూ.3.50 కోట్ల వ్యయంతో చేపట్టిన బీటీ రహదారి నిర్మాణ పనులకు శనివారం ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామీణ రోడ్లను పూర్తి స్థాయిలో బీటీ రహదారులుగా మారుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సయ్యద్ ఇమామ్, పంచాయతీరాజ్ శాఖ ఏఈ లావణ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బడేటి వెంకటేశ్వర్లు, సిరిపురం గ్రామ మాజీ సర్పంచ్ మొక్క లక్ష్మీవీణ, మాజీ ఎంపీటీసీ శెట్టి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

మెరుగైన వైద్యసేవలు అందేనా..

- అర్వపల్లి పీహెచ్‌సీలో తీరుతున్న సిబ్బంది కొరత
- ఇటీవల రెగ్యులర్ డాక్టర్, ఇద్దరు నర్సింగ్ సిబ్బంది నియామకం
- కానీ నిధులు లేక.. మందులు సరఫరా కాక సేవలకు ఆటంకం


అర్వపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అర్వపల్లి : అర్వపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత తీరుతోంది. మండల ప్రజలతో పాటు జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికులు, నాగారం మండల పీహెచ్‌సీ పరిధిలోకి వచ్చే పర్సాయపల్లి, బొల్లంపల్లి గ్రామాల ప్రజలు కూడా ఈ పీహెచ్‌సీలోనే వైద్య సేవలు పొందుతున్నారు. దీంతో ఇక్కడి పీహెచ్‌సీకి ఎప్పుడు రద్దీ ఉంటుంది. అయితే మొన్నటి వరకు సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉండడంతో సరైన వైద్య సేవలు అందించలేకపోయారు. ఇప్పుడిప్పుడే ఖాళీలు భర్తీ అవుతున్నాయి. ఇక్కడి పీహెచ్‌సీ 24 గంటల ఆస్పత్రి అయినప్పటికీ సరిపోను సిబ్బంది లేకపోవడంతో పూర్తిస్థాయిలో అమలుకాలేదు. ప్రస్తుతం సిబ్బంది ఖాళీల భర్తీతో సేవల సమయం పెరుగుతోంది.

రెగ్యులర్ డాక్టర్ నియామకం..

అర్వపల్లి పీహెచ్‌సీకి రెగ్యులర్ డాక్టర్‌గా డాక్టర్ భూక్యా నగేష్‌నాయక్‌ను నియమించారు. అలాగే సూర్యాపేట నుంచి ఇద్దరు నర్సింగ్ అధికారులను ఇక్కడికి పంపించారు. దీంతో కొంత వరకు సిబ్బంది కొరత తీరిందనే చెప్పవచ్చు. కానీ ప్రస్తుతం ఫార్మసిస్టుతో పాటు కోడూరు, కాసర్లపహాడ్, అర్వపల్లి, తిమ్మాపురం గ్రామాలకు ఒక్కో ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీతోపాటు అదనంగా మరో డాక్టర్‌ను నియమించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు పొందినా..

అర్వపల్లి పీహెచ్‌సీకి ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు పొంది ఏడాది దాటినా అప్పటి నుంచి దీనికి సంబంధించిన నిధులు మాత్రం మంజూరు కావడంలేదు. పీహెచ్‌సీ బడ్జెట్ కూడా విడుదల కాక ఆస్పత్రి నిర్వహణ భారంగా మారింది. అలాగే కొంత కాలంగా పైనుంచి అన్నిరకాల మందులు సరఫరా కావడం లేదు. నిధులను విడుదల చేసి అవసరమైన మందులను సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అన్ని రకాల మందులు రావడంలేదు



కొంతకాలంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పై నుంచి అన్ని రకాల మందులు సరఫరా కావడం లేదు.ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం. బీపీ గోళీలు, గ్యాస్ట్రిక్ టానిక్, వివిధ రాకల డ్రాప్స్, కొన్ని విలువైన మందుల సరఫరా నిలిచిపోయింది. ఆస్పత్రిలో మందుల కొరతను తీర్చాలి.

– చొల్లేటి రమణ, సామాజిక కార్యకర్త

ఇబ్బందులు లేకుండా సేవలు



ఆస్పత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలందిస్తున్నాం. సిబ్బంది ఖాళీల భర్తీ జరుగుతోంది. 24 గంటలు వైద్య సేవలందేలా ఏర్పాట్లు చేస్తున్నాం. మరికొన్ని పోస్టుల భర్తీ జరగాల్సి ఉంది. మందుల కొరత లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ భూక్యా నగేష్‌నాయక్, వైద్యాధికారి

ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన


ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి, తదితరులు

సూర్యాపేట : ఇమాంపేట కస్తూరిబా పాఠశాల వసతి గృహంలో ప్రహరీ నిర్మాణ పనులకు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. స్ప్రెడ్ ఇండియా, సువెన్ ఫార్మస్యూటికల్ గ్రూప్స్, యువ అన్‌స్టాపబుల్ ఆర్గనైజేషన్ ఆర్థిక సహకారంతో రూ.7లక్షలతో ప్రహరీ, ఆట స్థలం, కాంపౌండ్ వాల్‌గేట్, పాఠశాల లైటింగ్ బోర్డు పనులను ప్రారంభించారు.

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీలో చేరిక


పార్టీలో చేరుతున్న నాయకులు

భానుపురి : ఆత్మకూర్ (ఎస్) మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన సామ సత్తిరెడ్డి, పాన్నాల లచ్చిరెడ్డిలు శనివారం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో మాస్‌లైన్ పార్టీ రోజురోజుకూ ఎదుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కారింగుల వెంకన్న, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్, డివిజన్ నాయకులు ఎస్‌కే.సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్ల నిరసన


తుంగతుర్తిలోని కేజీబీవీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కేజీబీవీ నాన్ టీచించ్ సిబ్బంది

తుంగతుర్తి : కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. గత 18 ఏళ్ల నుంచి కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్‌ను రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకపోవడంతో మహిళా కార్మికులు మానసిక ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నసీమా, రేణుక, శోభ, వెంకటలక్ష్మి, మహిబు పాల్గొన్నారు.

ఏఎస్‌రావు పరీక్షలో విద్యార్థుల ప్రతిభ


ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న జయ పాఠశాల యాజమాన్యం


విద్యార్థులను అభినందిస్తున్న సిటీ టాలెంట్ స్కూల్ సిబ్బంది

సూర్యాపేటటౌన్ : డాక్టర్ ఏఎస్‌రావు అవార్డు కౌన్సిల్ వారు నిర్వహించిన 34వ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ మొదటి లెవెల్‌లో జయ ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు పాఠశాల కరెస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో 2,5,6,8వ ర్యాంకులు సాధించడంతోపాటు రెండు రాష్ట్రాల్లో సెలెక్ట్ అయిన మొత్తం 214 మంది విద్యార్థుల్లో 57 మంది జయ స్కూల్ నుంచి సెలెక్ట్ కావడం ఆనందంగా ఉందని తెలిపారు. 9వ తరగతి నుంచి వి. వైష్ణవి, డి.రిత్విక, పి.శ్రీశ్వాస, పి.షన్ముక ప్రత్యయ్, యం.ఆరాధ్య, కె.జాహ్నవి వెన్నెల, బి.ప్రసన్న, యం.షర్మిష్ఠ, పి.మేఘన, సీహెచ్.సంస్కృత, బి.శుశ్రుత, ఇ.నిత్యశ్రీ, వి.సుమలత, ఆర్.గ్రీష్మశ్రీ, కె.నిహారిక, పి.సహస్ర, కె.హేమంత్‌సాయి, కె.దేవిప్రియ, కె.సాయియశిత, వి.శ్రుతిక, ఇ.సాయి దీక్షిత, కె.యజ్ఞశ్రీ, బి.హర్షితా రెడ్డి, కె.మనస్విని, షేక్ అబ్దుల్ ముసవ్వీర్, జి.లలితాదిత్య, ఎస్.సాకెత్, పి.వికాస్, కె.కార్తికేయ, బి.హేమంత్, పి.శివ వంశీ, సీహెచ్.నందవర్ధన్ రెడ్డి, వి.మహేష్, బి.సాయిహర్షిత్, పి.దర్శన్, యం.సాకేత్, ఎస్. జశ్వంత్ రెడ్డి, మణిదీప్ చంద్ర, జి.మోహన్ ఆదిత్య, ఆర్.విష్ణువర్ధన్, ఎస్.హర్షవర్ధన్, బి.హనుమాన్, ఆర్.రోమ్యానంద్, ఆర్.అభిరాజ్, కె.విశిష్టకుమార్, కె.భార్గవ్, 10వ తరగతి నుంచి వి.హాసిని, ఎ.వేదశ్రీ, బి.సాత్విక్, ఎ.రామ్ చరణ్, జి.సాయిప్రణవ్, యం.దిలీప్, ఎన్.లోకేష్, కె.సంజయ్, కె.లౌకిక్, సీహెచ్.అక్షయ్, ఎస్‌కే.తస్నీమ్ ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అర్హత సాధించిన విద్యార్థులను కరెస్పాండెంట్ జయవేణుగోపాల్, డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతి అభినందించారు.

సిటీ టాలెంట్ విద్యార్థుల ప్రతిభ

డాక్టర్ ఏఎస్‌రావు అవార్డ్స్ కౌన్సిల్ టాలెంట్ టెస్టులో పట్టణంలోని సిటీ టాలెంట్ స్కూల్ విద్యార్థులు 15 మంది ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరెస్పాండెంట్ ఆర్.ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే


చివ్వెంల : వట్టిఖమ్మంపహాడ్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తున్న అధికారులు, కమిటీ సభ్యులు

చివ్వెంల : గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సీహెచ్. సంతోష్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించి మాట్లాడారు. అర్హులైన ప్రతివారికి ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎండీ రషీద్, మధు, పవన్ కుమార్, గోగుల ఈదయ్య, యల్కపల్లి వెంకన్న, కొండ వెంకన్న, వీరబోయిన సైదులు యాదవ్, వీరబోయిన మహేష్ యాదవ్, అంజయ్య, మధు పాల్గొన్నారు.

పొరపాట్లు లేకుండా నమోదుచేయాలి

అర్వపల్లి : ఇళ్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి పూర్తి వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా ఇందిరమ్మ యాప్‌లో నమోదుచేయాలని ఎంపీడీఓ ఎం. సత్యనారాయణరెడ్డి, ఎంపీఓ టి.గోపి ఎన్యుమరేటర్లకు సూచించారు. మండల పరిధిలోని అర్వపల్లితోపాటు వివిధ గ్రామాల్లో శనివారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు, గ్రామ పంచాయతీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక


తుంగతుర్తి : నూతన కమిటీ సభ్యులు

తుంగతుర్తి : తుంగతుర్తి మండలం కబడ్డీ అసోసియేషన్ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కబడ్డీ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా గుడిపాటి సైదులు, ప్రధాన కార్యదర్శిగా గాజుల యాదగిరి, చైర్మన్‌గా పెద్దబోయిన అజయ్, ఉపాధ్యక్షులుగా ఎల్లబోయిన భిక్షం, బొంకూరి జలేందర్, మహిళా ఉపాధ్యక్షురాలుగా వీరబోయిన మల్లిక, గౌరవ అధ్యక్షులుగా అబ్బగాని సత్యనారాయణ, మద్దెల నర్సయ్య, మల్లేపాక సాయిబాబా, కోశాధికారిగా కొండగడుపుల యాకయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా చింతకుంట్ల అంబేద్కర్, జాయింట్ సెక్రటరీలుగా గాజుల రవి, బొంకూరి శ్యామ్, ఆకారపు భాస్కర్, చిటిపాక మహేష్, కార్యవర్గ సభ్యులుగా పులుగుజ్జ యాకయ్య, కొమరయ్య, అశోక్, అన్వర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ పదవీ కాలం 4 సంవత్సరాలు ఉంటుందని అబ్జర్వర్‌లు భూలోకరావు, కర్తయ్య తెలిపారు.

నూతనకల్ : నూతనకల్ మండల కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన కబడ్డీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిపారు. అధ్యక్షుడిగా సురేష్, సెక్రటరీగా భయ్యా కళ్యాణ్, ఉపాధ్యక్షులుగా భయ్యా రవీందర్, శ్రీకాంత్, కన్వీనర్‌లుగా తొట్ల వెంకన్న, జాయింట్ సెక్రటరీగా అరుణ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో హడక్ కమిటీ కన్వీనర్లు జి. కర్తయ్య, భూలోక రావు, రాష్ట్ర కమిటీ అబ్జర్వర్లు ఎ. మధు, ఎస్‌కే. మహబూబ్‌జానీ పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యం


సూర్యాపేట : మెనూ కార్డును ఆవిష్కరిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి, అధికారులు


పెన్‌పహాడ్ : విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ముత్తినేని వీరయ్య


తుంగతుర్తి : విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న చెవిటి వెంకన్నయాదవ్

సూర్యాపేట : గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచిందని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో నూతన మెనూను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని గురుకుల పాఠశాలల్లో, సంక్షేమ హాస్టళ్లలో డైట్ చార్జీలు, అదేవిధంగా కాస్మొటిక్ చార్జీలను పెంచిందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవరావు, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి లత, మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ రామ్మూర్తి, ప్రిన్సిపాల్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రత్యేక కృషి

పెన్‌పహాడ్ : వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన నూతన మెనూ పుస్తకాన్ని శనివారం మండల పరిధిలోని దోసపహాడ్ మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అదే విధంగా మండలంలోని జంగంపడిగె కాలనీలో ఇటీవల విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసెలు కాలిపోగా బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి, పబ్లిక్ క్లబ్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, ఎస్ఐ గోపికృష్ణ, పంచాయతీ కార్యదర్శి జానయ్య, మాజీ జెడ్పీటీసీ పిన్నాని కోటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు అమ్జద్‌అలీ, బైరు శైలేందర్, రమేష్, అభినయ్, శివనాయక్, బుస్సా వీరయ్య, సముద్రాల రాంబాబు, స్వర్ణ, పూర్ణయ్య, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బాలుర వసతి గృహంలో..

వసతి గృహాల్లోని విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న కామన్ డైట్ మెనూ ప్రారంభం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి భుజంగం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తుంగతుర్తి : విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో కామన్ డైట్ మెనూ ప్రారంభం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా గురుకులాల్లోని, వసతి గృహాల్లోని విద్యార్థులకు కాస్మొటిక్, డైట్ చార్జీలు పెంచకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని అన్నారు. అయితే విద్యార్థుల కష్టాలను గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డి నూతనంగా కామన్ డైట్ మెనూ విధానాన్ని ప్రారంభించారని తెలిపారు. సంక్షేమ శాఖల వసతి గృహాల్లో రాష్ట్ర ప్రభుత్వం డైట్ చార్జీలను 40శాతం పెంచడటమే కాక కాస్మొటిక్ చార్జీలను కూడా పెంచిందన్నారు. అనంతరం గురుకులంలోని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అలాగే గురుకుల పాఠశాల బృందం చెవిటి వెంకన్న యాదవ్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంధ్య, కాంగ్రెస్ జిల్లా మహిళ అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ, అనోక్, రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంఈఓ శాంతయ్య అన్నారు. శనివారం అనంతారం మోడల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంజీవ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోషక విలువలతో కూడిన భోజనం

అర్వపల్లి : ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన మెనూతో పిల్లలకు పోషక విలువలతో కూడిన రుచికరమైన భోజనం అందుతుందని ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఎంపీఓ టి. గోపి అన్నారు. అర్వపల్లిలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కొత్త మెనూతో కూడిన భోజనాన్ని అందించారు. అధికారులు పిల్లలకు స్వయంగా అన్నం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సంక్షేమ అధికారి కాటూరి రామానుజాచార్యులు, సిబ్బంది రాము, సావిత్రి, యల్లమ్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

నాగారం : వసతి గృహాల్లోని విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీఓ కె.మారయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి కామన్ డైట్ మెనూను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వసతి గృహంలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని, మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వసతి గృహంలో రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని, వంట గదిని, కూరగాయలను పరిశీలించారు. అలాగే విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నూతనకల్ : వసతి గృహాల్లోని విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న కామన్ డైట్ మెనూను శనివారం మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహంలో ప్రారంభించి మాట్లాడారు. ప్రతి విద్యార్థికి పోషకాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలను పెంచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి పద్మ, ఆర్ఐ హాసన్ పాల్గొన్నారు.

మెనూ కరపత్రాల ఆవిష్కరణ

చివ్వెంల : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి భావిపౌరులుగా ఎదగాలని కమిషనర్ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రవి కుమార్ అన్నారు. ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న మెనూ వివరాలను తెలుపుతూ రూపొందించిన కరపత్రాలను శనివారం మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ క్రిష్ణయ్య, హెచ్ఎం లింగయ్య, హెచ్‌డబ్ల్యూఓ కవిత, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


పెన్‌పహాడ్ : బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఏఓ


తిరుమలగిరి : అనంతారం మోడల్ స్కూల్‌లో వంటలను పరిశీలిస్తున్న ఎంఈఓ


నాగారంలోని ఎస్సీ వసతి గృహంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ మారయ్య


అర్వపల్లి : పిల్లలకు అన్నం వడ్డిస్తున్న అధికారులు


నూతనకల్ : మాట్లాడుతున్న తహసీల్దార్


చివ్వెంల : మెనూ పత్రాలతో అధికారులు

16న చలో అసెంబ్లీ

ఆత్మకూర్ (ఎస్) : నిరుద్యోగ, వైద్య, విద్య సమస్యల పరిష్కారానికి ఈనెల 16వ తేదీన నిర్వహించే చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కోశాధికారి బండి రవి ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని తెలిపారు.

నేడు వైద్యశిబిరం

నూతనకల్ : మండల కేంద్రంలోని మాతా డయోగ్నస్టిక్ సెంటర్ పాలిక్లినిక్‌లో ఆదివారం నిర్వహించే ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నాగుల్‌మీరా కోరారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గ్యాస్ట్రో, న్యూరాలజీ విభా గాలకు చెందిన ప్రత్యేక వైద్య నిపుణుల పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా శ్రీదత్త జయంతి వేడుకలు


శ్రీ దత్త జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

పెన్‌పహాడ్ : అనంతారం క్రాస్ రోడ్డులోని మేకల లక్ష్మయ్య మెమోరియల్ గార్డెన్స్‌లో శనివారం శ్రీ దత్త జయంతి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇరువంటి సత్యనారాయణ శర్మ మాట్లాడారు. ఆదివారం మండలంలోని లింగాల క్రాస్ రోడ్డు నుంచి ఫస్ట్‌లిఫ్ట్ దారిలోని శ్రీ దత్త కుటీర్ వరకు యాత్ర ఉంటుందని, అనంతరం పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.